


రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో నిత్యం నిర్వహించే నారసింహ సుదర్శన హోమానికి ఎస్.గోవింద దాసు, సర్వలోకేశ్వరీదేవి దాసి దంపతులు (కాకినాడ) శనివారం రూ.లక్ష శాశ్వత విరాళం సమర్పించారు.




మృత్యువులోనూ వీడని బంధం

మృత్యువులోనూ వారి దాంపత్య బంధం వీడలేదు.. ఏడడుగులతో నూరేళ్లు జీవితాన్ని గడపాల్సిన ఆ దంపతులు అనుకోని ప్రమాదంలో అనంత లోకాలకు వెళ్లిపోయారు.

8లో

డెల్టాలకు 10,950 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 10,950 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.20 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: రాజమహేంద్రవరం యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, కేంద్ర గ్రామీణ అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. ఈ విషయాన్ని శనివారం కేంద్ర గ్రామీణ అభివృద్ధి శిక్షణ సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాస్ తెలిపారు. కంప్యూటర్ బేసిక్స్, అకౌంటింగ్, ఫోటోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఉచిత వసతి, భోజన సౌకర్యాలతో 30 రోజుల శిక్షణ ఇస్తామన్నారు. దీనికోసం 19 నుంచి 45 ఏళ్ల లోపు యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన యువత ఈ నెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. లేకుంటే ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో రాజమహేంద్రవరం ఐఎల్‌టీడీ వద్ద శిక్షణ సంస్థలో సంప్రదించాలన్నారు. శిక్షణ అనంతరం రెండు ప్రభుత్వ సర్టిఫికెట్లతో పాటు ఉచిత టూల్ కిట్లు అందిస్తామన్నారు. బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబర్లు 85559 88580, 90143 28803, వాట్సాప్ నంబర్ 85008 55063లో సంప్రదించాలని కోరారు.

బాల బాలాజీకి భక్త నీరాజనం



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: బాల బాలాజీ స్వామికి భక్తులు నీరాజనాలు పలికారు.. ఆ స్వామి వారిని దర్శించుకుని తరించారు.. అప్పనపల్లి బాల బాలాజీ స్వామివారి ఆలయం శనివారం గోవిందనామ స్మరణతో మార్మోగింది. ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న పవిత్ర వైనతేయ గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. అనంతరం ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు దీరిన బాల బాలాజీ స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని చూసి పరవశించారు. భక్తుల రాకతో కొత్త గుడితో పాటు పాత గుడి వద్ద సందడి నెలకొంది. వివిధ సేవల ద్వారా రూ.2.08 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.60 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.47,833 విరాళంగా సమర్పించారు. 3,571 మంది స్వామి వారిని దర్శించుకోగా, 2,695 మంది స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారని ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు.

ఇంటర్ పరీక్ష ఫీజు తత్కాల్ స్కీమ్‌కు 29 తుది గడువు

రాయవరం: ఇంటర్మీడియెట్ మొదటి, రెండో సంవత్సరం పరీక్ష ఫీజును చెల్లించని విద్యార్థులకు తత్కాల్ స్కీమ్‌లో అవకాశం కల్పించారు. ఈ విషయాన్ని ఇంటర్మీడియేట్ డీవీఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి శనివారం తెలిపారు. ఇంటర్ రెగ్యులర్, ఫెయిలైన, డిస్కంటిన్యూ చేసిన విద్యార్థులు పరీక్ష ఫీజును తత్కాల్ స్కీమ్‌లో చెల్లించుకునేందుకు ఈ నెల 29వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా అవకాశం ఉందన్నారు. అపరాధ రుసుంతో కలిపి పరీక్ష ఫీజుగా రూ.3 వేలు చెల్లించాలన్నారు.

రత్నగిరికి భక్తుల తాకిడి

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే వేలాదిగా తరలి రావడంతో స్వామివారి దర్శనం క్యూలైన్లు, వ్రత, విశ్రాంతి మండపాలు భక్తులతో నిండిపోయాయి. స్వామివారి ఉచిత దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు పూజలు చేశారు. అనంతరం రావిచెట్టు వద్ద ప్రదక్షిణలు చేసి, జ్యోతులు వెలిగించారు. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారు.

అమ్మచేతి గోరుముద్దలా..

- పోషకాలను అందిస్తున్న 'జగనన్న గోరుముద్ద'
- రోజుకో రకం వంటకాలతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- మూడు రోజులు రాగి జావ, ఐదు రోజులు కోడిగుడ్డు
- మెనూ ప్రకారమే వంటలు
- చిన్నారుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

కాకినాడ సిటీ: డ్రాపౌట్ల నివారణతో పాటు, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో పాఠశాలల్లో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోంది. అయితే, దీనిపై చిత్తశుద్ధి కొరవడటం, పర్యవేక్షణ లోపం కారణంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకం సరిగ్గా అమలు కాక, విద్యార్థులకు సరైన ఆహారం అందేది కాదు. వండిన పదార్థాలు నాసిరకంగా ఉండటంతో



పాఠశాలలో రాగి జావ తాగుతున్న విద్యార్థులు

మధ్యాహ్న భోజనం చేయడానికి విద్యార్థులు అంతగా ఇష్టపడేవారు కాదు. ప్రజాసంకల్ప యాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల ఆకలి బాధలను గమనించారు. గత ఎన్నికల్లో అఖండ విజయంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించగానే.. వారికి నాణ్యమైన పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో గతంలో ఎన్నడూ చూడని మార్పులు చేశారు. జగనన్న గోరుముద్ద పేరిట విద్యార్థుల ఎదుగుదలకు అవసరమైన పోషకాహారంతో నూతన మెనూ రూపొందించి, పక్కాగా అమలు చేస్తున్నారు. రోజుకో వంటకంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. గతంలో వారానికి మూడు



భోజనం తింటున్న విద్యార్థినులు

సార్లు కోడిగుడ్లు అందించే వారు. చాలాసార్లు అవి చెడిపోయేవి. వాటిని తినేందుకు విద్యార్థులు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం ప్రభుత్వం వారంలో వారానికి ఐదుసార్లు కోడిగుడ్లు అందిస్తున్నారు. ఏ వారంలో సరఫరా అయిన గుడ్లు అదే వారంలో ఉపయోగించేలా వాటిపై గుర్తులు వేస్తున్నారు. ఇలా ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

పారదర్శకత.. పర్యవేక్షణ

జగనన్న గోరుముద్ద అమలు బాధ్యతను పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. వీరితో పాటు పేరెంట్స్ కమిటీ సభ్యులు, సచివాలయ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసిస్టెంట్, గ్రామ కమిటీ ప్రతినిధులు కూడా ప్రతి రోజూ ఆహార పదార్థాల నాణ్యతను పర్యవేక్షిస్తున్నారు. ఆ తరువాతే విద్యార్థులకు ఆహార పదార్థాలు వడ్డిస్తున్నారు. ఎంఈఓలు కూడా రోజూ తమ పరిధిలోని ఒక పాఠశాలను సందర్శించి, నాణ్యతను పరిశీలిస్తున్నారు. తద్వారా ఈ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నారు.

విద్యార్థుల సంఖ్య పెరిగింది



జగనన్న గోరుముద్ద అమలు నేపథ్యంలో పాఠశాలల్లో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరిగింది. పోషకాహారం అందిస్తూండటంతో పిల్లలు బడుల్లోనే భోజనం చేసేలా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. ఎంఈఓలు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ పర్యవేక్షణలో నాణ్యతలో రాజీ పడకుండా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్య, జిల్లా విద్యాశాఖాధికారి

జగనన్న గోరుముద్ద మెనూ



సోమవారం : హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు, వెజిటబుల్ పలావ్, కోడిగుడ్డు కూర, చిక్కీ

మంగళవారం : పులిహోర, టమాటా పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగి జావ


బుధవారం : వెజిటబుల్ బిర్యానీ, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ

గురువారం: నిమ్మకాయ పులిహోర, టమాటా చెట్నీ, ఉడికించిన గుడ్డు, రాగి జావ

శుక్రవారం : అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ

శనివారం : ఆకుకూర అన్నం, పాలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా, తీపి పొంగలి, రాగి జావ

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల వివరాలు



	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	926	42,320
ప్రాథమికోన్నత	105	12,186
ఉన్నత	226	86,944
మొత్తం	1,257	1,41,450

రుచిగా వండుతున్నారు



నేను రోజూ మధ్యాహ్నం స్కూల్లో జగనన్న గోరుముద్ద తింటున్నాను. వారానికి ఐదు రోజులు కోడిగుడ్లు ఇస్తున్నారు. రోజుకో వెరైటీ కూరతో భోజనం పెడుతున్నారు. గతంలో స్కూల్లో భోజనం తినాలనిపించేది కాదు. ఇప్పుడు ఇంటి దగ్గర కంటే బడిలోనే రుచిగా ఉంటోంది. చదువుకోవడానికి, తినడానికి ఎలాంటి ఇబ్బందులూ లేవు. మా అమ్మానాన్నలు కూడా సంతోషంగా బడికి పంపుతున్నారు.

– కె.శ్రీలక్ష్మి, విద్యార్థిని, జెడ్పీ ఉన్నత పాఠశాల, తూరంగి

రాగి జావంటే ఇష్టం



వారంలో మూడు రోజులు ఇస్తున్న రాగి జావ అంటే నాకు చాలా ఇష్టం. స్కూల్‌కు వచ్చిన వెంటనే ప్రార్థన తర్వాత రాగి జావ ఇస్తున్నారు. మేమంతా ఇష్టంగా తాగుతున్నాం. మా అమ్మ కూడా రాగి జావ బలాన్నిస్తుందని చెప్పింది. ఏ రోజు ఏ ఆహారం పెడతారో మా స్కూల్ కిచెన్ గోడపై రాసి ఉంది. రుచికరమైన వంటకాలను అందిస్తున్న జగన్ మామయ్యకు థ్యాంక్స్.

– ఎస్.నిరంజన్, విద్యార్థి, జెడ్పీ ఉన్నత పాఠశాల, తూరంగి

కడుపు నిండా తింటున్నాం



పాఠశాలలో మధ్యాహ్న భోజనం చాలా బాగుంది. గతంలో కంటే ఇప్పుడు ప్రతి రోజూ ముందుగా నిర్ణయించిన మెనూ ప్రకారం ఆహార పదార్థాలు వండి పెడుతున్నారు. మా స్కూల్లో ఒకరిద్దరు తప్ప అందరం కడుపు నిండా ఈ భోజనాన్నే ఇష్టంగా తింటున్నాం. రోజూ అన్నం, గుడ్డు, చిక్కీ ఇస్తున్నారు. దీంతో సాయంత్రం ఇంటికి వెళ్లే వరకూ ఆకలి తెలియడం లేదు.

– వి.పూజేశ్వరి, విద్యార్థిని, జెడ్పీ ఉన్నత పాఠశాల, తూరంగి

టైమ్ ప్రకారం ఆహారం



మా బడిలో ఇటు చదువు, అటు ఆహారం టైమ్ ప్రకారం జరుగుతున్నాయి. మధ్యాహ్న భోజనం కింద మాకు పెడుతున్న ఆహారంలో ఏయే పోషకాలున్నాయో పాఠ్యాంశాల ద్వారా తెలుసుకున్నాం. అప్పటి నుంచీ ఇంకా ఆనందంగా తింటున్నాం. గతంలో ఉండే మెనూలో చాలా మార్పులు చేయడంతో ఆహారం రుచిగా ఉంటోంది. మాలాంటి పేద విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమానికి కృషి చేస్తున్న జగన్ మామకు ధన్యవాదాలు.

– కేవీవీ నరసింహ, విద్యార్థి, జెడ్పీ ఉన్నత పాఠశాల, తూరంగి

దేశానికి దశ, దిశ అంబేడ్కర్

- విగ్రహావిష్కరణ సభలో మంత్రి విశ్వరూప్
- ముమ్మిడివరంలో అంబేడ్కర్ కన్వెన్షన్ హాలు ప్రారంభం



ముమ్మిడివరంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే సతీష్‌కుమార్

ముమ్మిడివరం: దేశానికి దశ, దిశ నిర్దేశించిన మహోన్నతుడు అంబేడ్కర్ అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శనివారం ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి పోలమ్మ చెరువు గట్టుపై కొత్తగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మంత్రితో పాటు ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆవిష్కరించారు. రూ.కోటితో నిర్మించిన అంబేడ్కర్ కన్వెన్షన్ హాలును ప్రారంభించారు. అనంతరం నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి విశ్వరూప్ మాట్లాడారు. విద్యతోనే సమాజంలో అసమానతలు తొలగి సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలన్నారు. దేశంలో మహిళలకు సమాన హక్కులు కల్పించిన మహానీయుడు అంబేడ్కర్ అని మంత్రి కొనియాడారు. విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రపంచంలోనే ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించడం అభినందనీయమని అన్నారు. అనాతవరంలో పీవీ రావు ఘాట్ నిర్మాణానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ యువత అంబేడ్కర్ ఆశయ సాధనకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ భావజాలాన్ని అర్థం చేసుకుని, ఆయన బాటలో పయనించడం ద్వారా సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందన్నారు. ముమ్మిడివరంలో అంబేడ్కర్ కన్వెన్షన్ హాలును అభివృద్ధి చేసి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, జెడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు, కాశి బాల మునికుమారి, నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచన విధానమే సమాజాభివృద్ధికి మార్గమన్నారు. సభలో జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, ఎంపీపీ కోలా గంగాభవాని, కోలా బాబ్జీ, ఐ.పోలవరం, కాట్రేనికోన జెడ్పీటీసీ సభ్యులు ముదునూరి సతీష్‌రాజు, నేల కిశోర్, ఐ.పోలవరం ఎంపీపీ మిరియాం జ్యోతి, పాము రాజేంద్రప్రసాద్, కాశి జగపతి, దళిత సంఘాల నాయకులు, అంబేడ్కర్ అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ఐటీ విభాగం కమిటీ నియామకం



తోరం గౌతమ్‌రాజు, అధ్యక్షుడు

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఐటీ విభాగం కమిటీని పార్టీ అధిష్టానం నియమించింది. జిల్లా అధ్యక్షునిగా తోరం గౌతమ్‌రాజు (పి.గన్నవరం నియోజకవర్గం), ఉపాధ్యక్షులుగా చిత్రపు కిషోర్ చెన్నారెడ్డి (రాజోలు), కాశి శ్రీనివాసరావు (ముమ్మిడివరం), రుద్రరాజు సూర్యసుధీర్‌వర్మ (అమలాపురం), ప్రధాన కార్యదర్శులుగా కొప్పిశెట్టి శ్రీనివాస్ (అమలాపురం), దొండపాటి ప్రసన్నకుమార్ (రాజోలు), బి.రాఘవేంద్ర (కొత్తపేట), టి.పుల్లేశ్వరరావు (మండపేట), కార్యదర్శులుగా కొల్లు గౌతమ్‌బాబు (అమలాపురం), నల్లా రామకృష్ణ దుర్గావరప్రసాద్ (అమలాపురం), పాయ్యల సాయిభాస్కర్ (అమలాపురం), బళ్ల శ్రీనివాస్ (రాజోలు), బత్తుల శ్రీనివాస్ (రాజోలు), ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి (కొత్తపేట), జె.రామరాజు (కొత్తపేట), కొండపల్లి వరప్రసాద్ (మండపేట), సమ్మల ధనరాజు (మండపేట), రమణాతి దేవేంద్ర (ముమ్మిడివరం), సంయుక్త కార్యదర్శులుగా మంగళంపల్లి సుబ్రహ్మణ్యసాయి ప్రదీప్ (అమలాపురం), దేవ దయానందరాజు (రాజోలు), కాండ్రేగుల శ్రీనివాస్ (రాజోలు), సి.ఫణికుమార్ (కొత్తపేట), బి.భాస్కరరావు (కొత్తపేట), కాకిలేటి మోహనరావు (మండపేట), శెట్టి నాగేశ్వరరావు (మండపేట) నియమితులయ్యారు.

జిల్లా సీసీఎస్ సీఐగా అబ్దుల్ సలామ్

అమలాపురం టౌన్: జిల్లా సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) సీఐగా అబ్దుల్ సలామ్ నియమితులయ్యారు. అమలాపురం సీసీఎస్ సీఐగా పనిచేసిన తిరుపతిరావు ఇటీవల కాకినాడ జిల్లా ఇంటెలిజెన్స్ సీఐగా వెళ్లడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం పోలీసు కమిషనరేట్‌లో ఏలూరు రేంజ్‌కు సంబంధించి వీఆర్‌లో ఉన్న అబ్దుల్ సలామ్ బదిలీపై జిల్లా సీసీఎస్ సీఐగా వస్తున్నారు.

రావులపాలెం సీఐగా రామ్‌కుమార్

రావులపాలెం సీఐగా ఎం.రామ్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ప్రస్తుతం ఆయన పోలీస్ కమిషనరేట్‌లో ఏలూరు రేంజ్‌కు సంబంధించి వీఆర్‌లో ఉన్నారు. రావులపాలెం సీఐగా ఆయన వస్తున్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ సీఐగా పనిచేసిన సీఐ ఎస్.రజనీకుమార్ పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. ఎన్నికల నిబంధనల ప్రకారం వీరు బదిలీలపై వెళ్తున్నారు.

కె.పెదపూడి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

అంబాజీపేట: 15వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేసిన కె.పెదపూడి సర్పంచ్ బీర శాంతి చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి కె.కృష్ణకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది ఆగస్టులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4 లక్షల పైబడి పంచాయతీ ఖాతాకు జమ అయ్యాయి. నిధులు జమ అయిన మరుసటి రోజున పంచాయతీ కార్యదర్శి విత్తనాల వెంకటరమణ ప్రమేయం లేకుండా సర్పంచ్ శాంతి బ్యాంకు నుంచి చెక్కు ద్వారా రూ.3.70 లక్షలు డ్రా చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి గత ఏడాది డీపీఓకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై డిసెంబర్‌లో డీఎల్‌పీఓ బొజ్జిరాజు, ఈఓపీఆర్డీ బి.మమత విచారణ జరిపారు. విచారణ అనంతరం డీపీఓకు నివేదికను అందించారు. ఈ నివేదిక ఆధారంగా సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జనవరి 25న డీపీఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నోటీసును సర్పంచ్‌కు ఈఓపీఆర్డీ మమత శనివారం అందజేశారు.

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆవిర్భావం



అధ్యక్షునిగా ఎన్నికైన డాక్టర్ రామకృష్ణంరాజు

అమలాపురం టౌన్: ఇండియా డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) జిల్లా శాఖ నూతనంగా ఏర్పాటైంది. స్థానిక సేఫ్ డెంటల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద ఐడీఏ కార్యాలయాన్ని ఆ అసోసియేషన్ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అమలాపురానికి చెందిన డాక్టర్ బీహెచ్‌వీ రామకృష్ణంరాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా అసోసియేషన్ నూతన ప్రతినిధులు మాట్లాడారు. ఇండియా డెంటల్ రాష్ట్ర అసోసియేషన్‌కు అనుబంధంగా జిల్లా శాఖను దాదాపు 150 మంది దంత వైద్యులతో కలసి ఏర్పాటు చేశామన్నారు. జిల్లా అధ్యక్షునిగా రామకృష్ణంరాజు, కార్యదర్శిగా డి.సత్య సునీల్, కోశాధికారిగా జి.గణాధిపతి, ఉపాధ్యక్షులుగా బీఎస్‌వీఎస్ ప్రసాద్, ఎస్.సజన్ ఆనంద్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.మురళీ కృష్ణంరాజు, సహాయ కార్యదర్శిగా జీఎస్ దీపక్, సీడీఈ చైర్మన్‌గా ఎస్‌వీ తేజవర్మ, సీడీహెచ్ చైర్మన్‌గా వై.కల్యాణ్, ఎడిటర్‌గా పి.మల్లిక్, ఐడీఏ రిప్రజంటేటివ్‌గా వీఎస్ కుమార్ భాగవతుల ఎన్నికయ్యారు. వీరితోపాటు నలుగురు వైద్యులు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా, 22 మంది వైద్యులు అడ్వయిజరీ కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు. ఆదివారం ఇందుపల్లిలోని ఏ-కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో జరిగే ప్రమాణ స్వీకారోత్సవానికి ఐడీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.కిరణ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీఎస్‌ఎస్‌ఎన్ మూర్తి, అమలాపురం కిమ్స్ డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ వి.శివకుమార్‌లు హాజరవుతారని రామకృష్ణంరాజు తెలిపారు.

ఆసరా తోడుగా...
ఆత్మీయత నిండుగా

సంక్షేమ దివ్వెలు తీసుకు వచ్చిన జగనన్నపై అక్కచెల్లెమ్మల్లో ఆత్మీయత కట్టలు తెంచుకుంది.. ఆసరాగా మారిన మంచి మనసును ప్రతి గుండె అక్కున చేర్చుకుంటోంది.. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా సంఘాలకు రుణ మాఫీ చేస్తూ నాలుగో విడత సొమ్ము విడుదల చేసిన ప్రభుత్వాన్ని ప్రతి మహిళా కీర్తిస్తోంది.. మా గుండె చప్పుడు నీవే జగనన్న అనే మాట అందరి నోట వినిస్తోంది. వైఎస్సార్ ఆసరా పథకం తమ కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలిచిందని ప్రతి మహిళా అంటోంది.



–కాకినాడ రూరల్, ప్రత్తిపాడు రూరల్

▶▶ఒంటరి జీవితానికి వెలుగై..

ఈమె పేరు బొడ్డు రాఘవమ్మ. కాకినాడ రూరల్ వలసపాకలకు చెందిన ఈమె భర్త నూకరాజు చనిపోయాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రాఘవమ్మ రమణయ్యపేట సర్పవరం జంక్షన్ వద్ద చేపలు విక్రయిస్తూ ముగ్గురు ఆడపిల్లలను పెంచి, పోషించి చదివించడంతో పాటు పెళ్లిళ్లు చేసింది. ఒంటరిగా జీవిస్తున్న ఆమెకు వైఎస్సార్ ఆసరా ద్వారా ఏటా డ్వాక్రా రుణమాఫీ అందుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తోంది. తమ బాలాజీ గ్రూపునకు నాలుగు విడతలుగా రూ.4 లక్షల సాయం అందిందని, ఇది వ్యాపార అభివృద్ధికి తోడ్పడిందని రాఘవమ్మ చెబుతోంది. ప్రతి నెలా పింఛన్ అందుకుంటున్నానని, మళ్లీ జగన్ సీఎం కావాలని ఆమె కోరుకుంటోంది.


రమణయ్యపేట మార్కెట్ వద్ద చేపలు విక్రయిస్తున్న బొడ్డు రాఘవమ్మ

▶▶ఆర్థికంగా లబ్ధి పొందుతూ..

ఈమె పేరు వెంకటదుర్గ. ప్రత్తిపాడు రూరల్ ధర్మవరం గ్రామం. పాదుపు సంఘంలో సభ్యురాలుగా చేరి బ్యాంక్ లింకేజీతో తీసుకున్న నగదుతో పాడి గేదెను కొనుగోలు చేసింది. దానిపై వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తుంది. వైఎస్సార్ ఆసరా పథకం కింద తమ గ్రూపునకు రూ.1.04 లక్షలు వచ్చిందని, నాలుగు విడతలుగా లబ్ధి పొందానని వెంకటదుర్గ చెబుతోంది. అంతేకాకుండా ప్రభుత్వం ద్వారా వైఎస్సార్ సున్నా వడ్డీ, చేయూత పథకాలు అందడంతో ఆర్థికంగా ఆసరాగా మారిందని అంటోంది.

బ్యాంకు రుణంతో కొనుగోలు చేసిన గేదెతో మేడిబోయిన రాజు →



క్లుప్తంగా

ఎల్‌జీ ఎస్‌ఎంఎస్ కాంటెస్ట్ విజేతకు బహుమతి


కేక్ కట్ చేస్తున్న విజేత వెంకటేశులు తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం సిటీ): ఎల్‌జీ ఇండియా కా సెలబ్రేషన్స్‌లో కాకినాడ జిల్లా గండేపల్లికి చెందిన రైతు కూలీ జి.వెంకటేశులు ఐకేసీ డ్రీమ్ హోమ్ ప్యాకేజీ గెలుచుకున్నారు. రూ.4.50 లక్షల విలువైన ఐదు రకాల ఎల్‌జీ గృహోపకరణాలను డ్రాలో పొందారు. ఎల్‌జీ ఎస్‌ఎంఎస్ కాంటెస్ట్‌లో భాగంగా వెంకటేశులు ఈ బహుమతి సాధించారు. శనివారం రాజమహేంద్రవరం తాడితోట జంక్షన్‌లోని ఆదిత్య ఎంటర్‌ప్రైజెస్ షోరూమ్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎల్‌జీ రీజినల్ మేనేజర్ కరాటం వెంకట కృష్ణాజీ బహుమతులను విజేతకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియా కా సెలబ్రేషన్స్‌లో భాగంగా గత అక్టోబర్ నుంచి 58 రోజులు ఎస్‌ఎంఎస్ కాంటెస్ట్ నిర్వహించిందని తెలిపారు. ఇందులో రాష్ట్రంలో నలుగురు విజేతలుగా డ్రాలో నిలిచారన్నారు. ఒకటి గండేపల్లికి చెందిన రైతు కూలీ వెంకటేశులు ఐకేసీ డ్రీమ్ హోమ్ ప్యాకేజ్ విజేత కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎల్‌జీ రాజమహేంద్రవరం మేనేజర్ వీర, ఆదిత్య ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యం చంద్రమౌళి పాల్గొన్నారు.

నేడూ విద్యుత్ బిల్లుల చెల్లింపులు

అమలాపురం రూరల్: జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో సెలవు రోజు అయినప్పటికీ ఆదివారం కూడా విద్యుత్ బిల్లుల చెల్లింపులు జరుగుతాయని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ మోకా రవికుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకుని, బిల్లులను సకాలంలో చెల్లించాలని కోరారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతో పాటు ఏపీ ఈపీడీసీఎల్ సెక్షన్ ఆఫీస్ కలెక్షన్ సెంటర్లు, ఏటీపీ సెంటర్లు ఆదివారం పని చేస్తాయని వివరించారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన వీరవెంకట సత్యనారాయణ

అల్లవరం: ఓడలరేవు–కొమరగిరిపట్నం గ్రామాల సరిహద్దు ప్రాంతం సముద్ర తీరంలోని సరుగుడు తోటలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన విప్పర్తి వీరవెంకట సత్యనారాయణ (32) శనివారం ఉదయం సరుగుడు చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై హరీష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబీకుల నుంచి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు.

అంకితభావంతో బోధన చేయాలి

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్


పొన్నమండలో ప్రాథమిక పాఠశాల రికార్డులు పరిశీలిస్తున్న ప్రవీణ్ ప్రకాష్

రాజోలు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో నిధులు కేటాయిస్తుందని, ఉపాధ్యాయులు అంకితభావంతో బోధన చేయాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సూచించారు. శనివారం రాజోలు మండలంలోని పలు పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత తాటిపాక ఉన్నత పాఠశాల, పొన్నమండ ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. అనంతరం పొన్నమండ ఉన్నత పాఠశాల, రాజోలు బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ఎమ్మార్సీ కార్యాలయంలో రికార్డులను ఆయన చూశారు. తాటిపాక ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతిలో ఆరు నెలలుగా దృశ్య శ్రవణ విద్యకు వినియోగించే ఎల్ఈడీ టీవీ పని చేయకపోవడంపై డీఈఓ కమలకుమారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సంబంధించిన వర్క్ బుక్స్, నోట్ బుక్స్‌ను పరిశీలించి విద్యార్థులతో కలసి ఫోటో దిగారు. అనంతరం పొన్నమండ ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నా విద్యార్థులకు ఇచ్చిన హోం వర్క్ పుస్తకాలు ఖాళీగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. పొన్నమండ ఉన్నత పాఠశాలలో ఎనిమిది, తొమ్మిదో తరగతి విద్యార్థుల్లో కొంతమంది ట్యాబ్‌లు కూడా ఓపెన్ చేయలేని పరిస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను రేకుల షెడ్‌లో కూర్చొబెట్టి బోధించడం ఏంటని అధ్యాపకులను ప్రశ్నించారు. బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన అనంతరం ఎమ్మార్సీ భవనంలో రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం రూ.కోట్ల నిధులు విద్యాభివృద్ధికి కేటాయిస్తుందని, వాటి ఫలాలు విద్యార్థులకు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆయన వెంట ఆర్‌జేడీ జి.నాగమణి, డీఈఓ ఎం.కమలకుమారి, ఎస్ఎస్ఏ ఏడీ నక్కా సురేష్, జిల్లా అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, రమేష్‌బాబు, పి.రాంబాబు, డాక్టర్ ఎంఏకే భీమారావు, ఎంవీపీ సత్యనారాయణ, రామచంద్రపురం డీవైఈఓ శ్రీపాద నరసింహఫణి ఉన్నారు.

ఉత్తమ ప్రదర్శనగా 'ఇంద్రప్రస్థం'

ముగిసిన రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు


పోటీల్లో ఇంద్రప్రస్థం నాటికకు ప్రథమ బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

పెద్దాపురం: మండలంలోని చంద్రమాంపల్లిలో మూడు రోజులుగా జరిగిన స్నేహా ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి పంచమ నాటక కళా పరిషత్ నాటిక పోటీలు శనివారంతో ముగిశాయి. స్నేహా ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేశీ రాజా ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఏడు నాటికలను ప్రదర్శించారు. ఇందులో గుంటూరు అభ్యుదయ ఆర్ట్స్ వారిచే ప్రదర్శించిన ఇంద్రప్రస్థం ప్రథమ స్థానాన్ని సాధించింది. హైదరాబాద్ మిత్ర ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన లక్ష్మణరేఖ నాటిక ద్వితీయ, కరీంనగర్ వారిచే స్వప్నం రాలిన అమృతం నాటిక తృతీయ స్థానాన్ని సాధించాయి. జ్యూరీ ప్రదర్శనగా కళాంజలి ప్రగతినగర్ వారిచే రైతేరాజు నాటిక నిలిచింది. ఉత్తమ నటుడిగా ఎంఎం భాష (లక్ష్మణరేఖ), ద్వితీయ ఉత్తమ నటుడిగా కృష్ణప్రసాద్ (స్వప్నం రాల్చిన అమృతం), ఉత్తమ నటిగా ఉషశ్రీ (స్వప్నం రాల్చిన అమృతం), ద్వితీయ ఉత్తమ నటిగా శాంతి (కెరటాలు), ఉత్తమ రచన కంచన సూర్యప్రకాష్ (రైతేరాజు), ఉత్తమ దర్శకత్వం రవీంద్రరెడ్డి (ఇంద్రప్రస్థం) ఎంపికయ్యాయి. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కె.శాంతారావు, గోగులపాటి సీతారామస్వామి, రాధాకృష్ణలు వ్యవహరించగా డి.క్రాంతికుమార్, ఐద్వా నాయకులు కూనిరెడ్డి అరుణ, గొందేశి రాజా, వెన్నా పండు, నానాజీల చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు. నాటక కళా పరిషత్ పోటీలకు సహకరించిన ప్రతి ఒక్కరికి స్నేహా ఆర్ట్స్ తరఫున నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేదారి నాగు, ఎం.సత్తిబాబు, దేవాడ పాపేశ్వరరావు, కంటిబోయిన ప్రసాద్, జ్యోతుల దొరబాబు, సమ్మెట గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విద్యుత్ వినియోగదారుల అభిప్రాయ సేకరణ


టీవీఎస్ఎన్ మూర్తి, విద్యుత్తు శాఖ ఎస్ఈ

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 29, 30, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో నిర్వహిస్తామని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ టీవీఎస్ఎన్ మూర్తి శనివారం తెలిపారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజమహేంద్రవరం ఎగ్జిక్యూటివ్ కార్యాలయం, రాజమహేంద్రవరం టౌన్, రాజమహేంద్రవరం రూరల్, కాకినాడ, పెద్దాపురం, జగ్గంపేట, రామచంద్రపురం, అమలాపురం, రంపచోడవరం డివిజన్ కార్యాలయాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో విద్యుత్ నియంత్రణ మండలి ప్రతిరోజూ అన్ని డిస్కంల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు స్వీకరిస్తుందన్నారు. విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ కార్యక్రమం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ ఉంటుందన్నారు. ధరలపై సందేహాలు, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు వినియోగదారులెవరైనా పాల్గొనవచ్చన్నారు. పాల్గొనేవారు దగ్గరలోని విద్యుత్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ముందుగా నమోదు చేసుకున్న వినియోగదారుల అభ్యంతరాలు విన్న తరువాత విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితో నమోదు చేసుకుని వినియోగదారుల అభ్యంతరాలు వినడం జరుగుతుందని మూర్తి తెలిపారు.

మృత్యువులోనూ వీడని బంధం

- రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల దుర్మరణం
- అమలాపురం వద్ద 216 జాతీయ రహదారిపై ప్రమాదం
- కుమార్తె ఇంటికి వెళ్లి వస్తుండగా ఘటన

అమలాపురం టౌన్: మృత్యువులోనూ వారి దాంపత్య బంధం వీడలేదు.. ఏడడుగులతో నూరేళ్ల జీవితాన్ని గడపాల్సిన ఆ దంపతులు అనుకోని ప్రమాదంలో అనంత లోకాలకు వెళ్లిపోయారు. అమలాపురం పట్టణ శివారు నుంచి ఉన్న 216 జాతీయ రహదారి బైపాస్ మార్గంలో రోళ్లపాలెం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. పట్టణంలో గండువీధికి చెందిన ప్రస్తుతం బోడసకుర్రు టిడ్కో ఇళ్ల సముదాయంలో నివసిస్తున్న భార్యాభర్తలు గారపాటి వెంకట్రావు (55), మంగతాయారు (50) ఈ ప్రమాదంలో ప్రాణాలు విడిచారు. బైపాస్ రోడ్డు చెంత ఉన్న పిల్లావారి గరువులో ఉన్న తన కుమార్తె ఇంటికి వచ్చిన ఆ దంపతులు మోటారు సైకిల్‌పై తిరిగి బోడసకుర్రులోని ఇంటికి వెళుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. రాజోలు వైపు నుంచి అతివేగంగా వస్తున్న మినీ వ్యాన్ వారి మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. భర్త వెంకట్రావు అమలాపురం ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పనిచేస్తున్నారు. మంగతాయారు గృహిణి. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. పెద్ద కుమార్తె రాజేశ్వరికి పెళ్లి చేశారు. చిన్న అమ్మాయి శుభకు పెళ్లి చేయాల్సి ఉంది.


మృతిచెందిన దంపతులు వెంకట్రావు, మంగతాయారు

కొత్త ఇంటి సరదా తీరకుండానే...

వెంకట్రావు కుటుంబం ఏడాది కిందటి వరకూ అమలాపురం గండువీధిలో ఓ అద్దె ఇంట్లో ఉండేది. ప్రభుత్వం బోడసకుర్రులోని టిడ్కో ఇళ్ల సముదాయంలో ఓ ఫ్లాట్ ఇవ్వడంతో ఇటీవలే గృహ ప్రవేశమై ఆ కుటుంబం సంతోషంగా ఉంటోంది. కొత్త ఇంటి సరదా తీరకుండానే భార్యాభర్తలు కన్ను మూయడంతో టిడ్కో ఇళ్ల సముదాయం నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండో అమ్మాయి పెళ్లి చేసేందుకు ఇటీవల కాలంలో సంబంధాలు కూడా చూస్తున్నారు. ఆ ముచ్చట తీరకుండానే ఆ భార్యభర్తలు మృత్యుఒడిలోకి వెళ్లడాన్ని వారి ఆడపిల్లలు ఇద్దరూ తట్టుకోలేకపోతున్నారు. చిన్న కూతురు అమలాపురంలో ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. రోడ్డు ప్రమాదం సమాచారం తెలియగానే డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ పర్యవేక్షణలో పట్టణ సీఐ క్రిష్టోఫర్, రూరల్ సీఐ పి.వీరబాబు, పట్టణ ఎస్సై సత్యనారాయణ, అల్లవరం ఎస్సై జి.హరీష్‌కుమార్‌లు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మినీ వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు ప్రమాద ఘటనపై స్థానికులు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. వ్యాన్ యజమాని వచ్చి సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. జాతీయ రహదారిలో రాత్రి సమయాల్లో సరైన వెలుతురు ఉండడం లేదని, తక్షణమే తగిన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.


ప్రమాదానికి కారణమైన మినీ వ్యాన్

సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్‌కుమార్ మిశ్రా

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని, దీనిపై ప్రతి పౌరుడు అవగాహన పెంచుకోవాలని ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్‌కుమార్ మిశ్రా అన్నారు. శనివారం స్థానిక జాంపేట పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో సీఐడీ ఏడీజీ ఎన్.సంజయ్, ఐసీఎస్‌సీఎస్ (ఇన్ఫోసెస్ కంప్లీ సొల్యూషన్స్) వారి సౌజన్యంతో రాజమహేంద్రవరం సీఐడీ, ప్రాంతీయ అధికారి ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్‌పై వర్క్‌షాప్ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్‌కుమార్ మిశ్రా, సీఐడీ విభాగం అదనపు ఎస్పీ సీహెచ్ పాపారావు, ఫార్మర్ ఇన్ఫర్మేషన్ అండ్ సైబర్ సెక్యూరిటీ రీసెర్చర్ బి.శ్రీనివాస్‌లు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రమోద్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ, చిన్న చిన్న చదువులు చదివిన వారే ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని, వారిని ఎదుర్కోవడంలో ఉన్నత విద్య అభ్యసించిన వారు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన మోసాల్లో ఎక్కువ శాతం ఇలాంటి కేసులే ఎదురయ్యాయని గుర్తు చేశారు. సాంకేతిక పరికరాలను ఉపయోగించే క్రమంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాలను అరికట్టేందుకు పోలీసులు ఎంత అప్రమత్తంగా ఉంటారో, సామాన్యులూ అంతే జాగ్రత్తగా ఉండాలని అన్నారు. మోసాలు జరిగినప్పుడు టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని, సైబర్ క్రైం విభాగంలో రిపోర్టు చేయాలని ఆయన తెలిపారు. వర్క్‌షాప్ ఉద్దేశాలు, ఇతర వివరాలను సీఐడీ విభాగ అదనపు ఎస్పీ సీహెచ్ పాపారావు వెల్లడించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన పోలీసు సిబ్బంది, జీఎంఎస్‌కే కాలేజీ విద్యార్థులు, బ్యాంకు సిబ్బంది, నెట్‌వర్క్ సర్వీస్ ప్రొవైడర్లు హాజరయ్యారు. సైబర్ నేరాలపై రూపొందించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయడంపై సీఐడీ హెడ్ క్వార్టర్స్ అదనపు ఎస్పీ సీహెచ్ సురేష్, సిబ్బంది అవగాహన కల్పించారు. ఇంటర్నెట్, మొబైల్ వినియోగంలో జాగ్రత్తలు వహించాలని, ఓటీపీలు, మోసపూరిత లింకులు, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఆర్థిక వ్యవహారాలు నిర్వహించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, తరచూ పాస్‌వర్డులు మార్చుకోవాలని వివరించారు. డీఎస్పీలు బి.రామకృష్ణ, సీహెచ్ పెంటారావు, ఇన్‌స్పెక్టర్ జీవీవీ సత్యనారాయణ, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్లు ఎం.బాలకృష్ణ, గోపాలకృష్ణ, డి.వి జయకుమార్, పీవీవీ నరసింహారావు, ఎమ్.శేషు, వి.శ్రీనివాస్, సీహెచ్ వెంకటేశ్వరావు, జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్‌కుమార్ మిశ్రా

వెంకన్న క్షేత్రం.. ఆధ్యాత్మిక శోభితం

- వాడపల్లికి పోటెత్తిన భక్తజనం
- ఒక్కరోజే రూ.32.36 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: వాడపల్లి క్షేత్రం ఆధ్యాత్మికతతో శోభిల్లింది.. ఆ శ్రీనివాసుని నామస్మరణతో మార్మోగింది.. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం అర్చకులు స్వామివారిని జామ, యాపిల్, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చి ఆ స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజాదికాలు నిర్వహించారు. మధ్యాహ్నం జరిగిన అన్న సమారాధనలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో వివిధ సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. ఈ ఒక్కరోజే ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.32,36,155 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. భక్తుల ఏర్పాట్లను వారి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఎస్సై బీవై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.


పూర్ణాలంకరణలో వేంకటేశ్వరస్వామి